
# మనిషి ఖరీదు = ?



## పవని నిర్మల ప్రభావతి

గుబురుగా, దట్టంగా అల్లుకుని వున్న గోరింట పొదలమాటున మెల్లిగా నడిచివస్తోంది కనకం. అమావాస్య. చీకటి.గాఢాంధకారం...పైన చుక్కలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. చీకటికి బాగా అలవాటుపడ్డంవల్ల ఆమెకు కళ్ళు కనిపిస్తున్నాయి బాగా. తెల్లటి పాములా కాలిబాట సాగిపోతోంది గోరింటపొదల మధ్యగా. గోరింట పూలగుత్తుల మీదినుంచి వస్తున్న గాలిలో...ఆ పూలవాసన గుబాళిస్తోంది. మరొకప్పుడైతే కనకం ఆ పూగుత్తులను వాసన చూస్తూ నిలబడిపోయేదే ! కానీ ఇప్పు డామెమనసు, దూరంగా వున్న రోడ్డుమీద రాబోయే లారీకోసం, డ్రైవరు గురువులుకోసం ఆతురతగా ఎదురు చూస్తోంది ... గుప్పున మొగలిపూల వాసనా, దానితోబాటే జరజర ఏదో పాకిన చప్పుడూ అయి త్రుళ్ళిపడింది కనకం...త్రాచుపాము అయివుంటుంది. లేదా మొగలిపొదల్లో వుండే మిణ్ణాగు అయి వుంటుంది. ఏదైనా తనని కాటు వేయలేదు ! పక్కగా పాకిపోయింది. కనకం గుండె రాయిలా అయిపోయింది ... దూరంగా రోడ్డుమీద లారీ ... గుంటల్లో, మిట్టల్లో పడుతూ లేస్తున్నట్లు, తాగి తూలుతున్నట్లు వస్తోంది ... పరుగులాటి నడకతో రోడ్డువారకు చేరుకుంది. అందాకా సిపాయిల్లా వున్న గోరింటపొదలు అక్కడితో ఆగిపోయాయి ... గురువులుకూ, కనకానికీ సంకేత స్థలం అదే ! కీచుమంటూ లారీ ఆగింది. గురువులు కిందికి దూకుతాడని చూస్తున్న కనకం, క్లీనరు అప్పారావు దిగటం చూసి నిరాశపడింది... 'పోన్లే! తనకు రాను తీరలేదేమో ! పీడి చేతి కిచ్చి పంపాడేమో !' అనుకుంది అంతలోనే.

అప్పారావు చీకట్లో కళ్ళు చించుకుని చూసాడు కనకంకోసం. నల్లచీరె, నల్ల రవికె తొడుక్కున్న నల్లటి కనకం ఓ పట్టాన కనిపించలేదా చీకట్లో ... 'ఏం దప్పారావ్ ?' అంది కనకం మెల్లిగా. ఇంకెవరేనా వాడివెంట వున్నారేమోనని, గోరింట పొదమాటుకు జరిగింది.

"ఎక్కడున్నావక్కా ?" అంటూ పొదదగ్గరికి వచ్చాడు అప్పారావు. ఆ సరికి కళ్ళు బాగా పరిసరాల్ని పోల్చుకొనే స్థితికి వచ్చాయి.

"ఇక్కడే !" రోడ్డుమీదికి వచ్చింది.

"తొరగా రా ! లారీ ఎక్కు. గురువులు మామ నిన్ను వున్నపళాన తీసుకురమ్మన్నాడు !" అన్నాడు ఆందోళనగా.

"ఎక్కడున్నాడు ? నే నెందుకూ ? అసలేమిటి సంగతి ?" అంది కనకం ఆదుర్దాగా చూస్తూ.

"యాక్సిడెంటయిందక్కా !"

"ఎక్కడరా నాయనా ?" పెద్ద పెట్టున ఏడుపు గొంతుతో అరిచింది.

"ఛత్ ! పెద్దగా గోలెట్టమాకు ! టౌన్‌లో నేనూ, వాడూ ఈడకే వస్తుంటే ... సైకిలు రిక్షా గుద్దేసింది. రోడ్డువార కంకర యూనిట్ మీద పడ్డాడు. తలకంతా గాయమైంది ... ప్రైవేటు డాక్టరిల్లు దగ్గరేవుంటే ఆడ చేర్పించాం. ఇప్పుడు వాడి భార్య, పిల్లలు వాడిదగ్గరే వున్నారనుకో. నిన్ను ఉన్నపళాన పిల్చుకురమ్మన్నాడు..."

కనకానికి...తన చుట్టూరా మరింత చీకటి అలుముకుపోయినట్లైంది ! "పద !" అంది. అప్పారావు చెయ్యి ఆసరాగా ఇచ్చి లారీ ముందుసీట్లో కూర్చోబెట్టాడు కనకాన్ని. అప్పారావు డ్రైవ్ చేస్తున్నాడు. కనకం సీటుకు చేరగిలబడి కళ్ళు మూసుకుంది. గురువులు తనకోసం డబ్బు తెస్తానన్నాడు ఈ రోజు ! యాక్సిడెంటులో పడి, ఆస్పత్రిలో పడిపోయాడు ... ఇంతకూ డబ్బువుందా వాడిదగ్గరే ?


"డబ్బు జేబులో పెట్టుకున్నాడు... అట్లా రోడ్డెక్కామో లేదో యాక్సిడెంటయింది...లారీ ఎక్కేసుంటే హాయిగా వచ్చేవాళ్ళం ... లారీ దగ్గరికి వచ్చేలోగా ..." అప్పారావు ఏదో చెప్పుకుపోతున్నాడు. కనకాని కవేమీ వినిపించటంలేదు ... గురువులు ఆస్పత్రిలో

వున్నాడు. వాడిదగ్గర తన డబ్బుంది. గురువులు భార్యా పిల్లలు కూడా ఆస్పత్రికే వచ్చారు ... త నిప్పుడు గురువులును చూడటానికి వెళ్ళాలి! వెళ్తోంది. వెళ్ళకపోతే బావుండదు... అక్కడ గురువులు భార్య రత్తమ్మ ఎంత గొడవ చేస్తుందో.

చివరగా ఈ అవకాశం కూడా చేజారిపోతుందా? అసలేమిటీ ఖర్మ... ఇలా ఎందుకు జరిగింది?

లారీ ముందుకు దూసుకుపోతోంది సిటీవేపు ... కనకం ఆలోచనలు వెనక్కి ... గతంలోకి ... పల్లెలోకి పరుగుతీశాయి వేగంగా.

* * *




నల్లగా, పుష్టిగా వుండే కనకంలో కళంతా ముఖంలో, కళ్ళలో వుందం టారు ఆ పల్లెవాళ్ళంతా. కనకం తండ్రి "ఏసోబు" ఆ ఊరి ప్రెసిడెంటుదగ్గర పాలేరుగా వుండేవాడు ఒకప్పుడు. ఉన్న ఇద్దరి కూతుళ్ళని, తన "పాలెం"లో అందరు పిల్లలకంటే గొప్పగా, ముద్దుగా పెంచుకున్నాడు. పెళ్ళిళ్ళు చేసాడు. పెద్దది గౌరి కాపురాని కెళ్ళిపోయింది. చిన్నది కనకం... అమ్మ లేనిదనీ, తనను వదిలి వుండ లేదనీ, తనదగ్గరే అట్టేపెట్టుకొన్నాడు ఏసోబు. అల్లుడు కొండయ్య సిటీలో పెద్ద లారీ ఓనరుదగ్గర క్లీనరుగా జేరి, సంవత్సరంకిందటే లారీ డ్రైవరయ్యాడు. బాగా సంపాయిస్తుంటాడు. లారీ లోడ్ దింపేశాక, లీవు దొరకంగానే ఓనరు లీవు ఇవ్వగానే ... పల్లెకు పరుగెత్తుకు వస్తాడు. వాడికి కనకం అంటే ప్రాణం ... వాడికీ అమ్మా, నాన్నా, ఎవరూ లేరు ... వస్తూ వస్తూ కనకానికి పూలు, పళ్ళు, రవికెలు, ఏసోబుకు చుట్టలు, తాగుడుకు నాల్గు రూపాయలు ఇలా పట్టుకువస్తాడు. ఏసోబు కందుకే పెద్దల్లుడికంటే చిన్నల్లుడిమీద పంచప్రాణాలు ... తన చిన్నల్లుడి గుణగణాలూ, గొప్పదనం గురించి పాలెంలో అందరితో చెప్పకు, చెప్పకు మురిసిపోతుంటాడు ఎప్పుడూ. కనకం పెళ్ళయ్యాకే, ఏసోబుకు పక్షవాతం వచ్చింది. పని మానేయాల్సి వచ్చింది. ప్రెసిడెంటు, కృతజ్ఞతకొద్దీ ఇచ్చిన ఎకరా మెట్టపొలం కవులికిచ్చి, ఇంట్లో కూర్చున్నాడు ... ఇంట్లోంకి బయటికీ, కాలు ఈడ్చుకుంటూ కట్టెమీద తిరగ్గలడేగానీ, ఎక్కువ దూరం నడవ లేడు. కుటుంబ పోషణంతా కొండయ్యే చూసుకుంటున్నాడు.

కనకానికి భర్తంటే ఎక్కడలేని ఆరాధన! పాలెంలో అంతా తన అదృష్టాన్ని గురించి పొగుడుతుంటే తనకెంతో గర్వంగా వుండేది. ఒక్కోసారి ఈ పల్లెమీదుగా "లారీ లోడ్" పోవలసి వస్తే, కొండయ్య లారీ రోడ్డుమీద ఆపి, కనకాన్ని వెంటబెట్టుక, లారీలో ఎక్కించుకు వెళ్ళేవాడు. క్లీనర్ అప్పారావు తప్ప మరెవరూ లారీలో వుండరు కాబట్టి, అప్పారావుకు డ్రైవింగ్ అప్పజెప్పి, కనకం, కొండయ్య కబుర్లాడుకుంటూ కూర్చునేవాళ్ళు ... టౌన్లో లారీ అన్లోడ్ చేశాక, సినిమాకు వెళ్ళి, ఏ ఫలహారమో హోటల్లో తినేసి, మళ్ళీ లారీలో వచ్చేసి, పల్లెలో కనకాన్ని వదల్లి, లారీ ఓనర్కు అప్పజెప్పి, వచ్చేవాడు కొండయ్య... ఇంతదృష్టం ఎవరికుందా పల్లెలో? ఇంత జల్సాగా డబ్బు ఖర్చుచేసి, ఇంటికి కూడా పళ్ళు, పూలూ, ఫలహారాలూ పట్టుకొచ్చే మొగుళ్ళెంత మందికున్నా రా పల్లెలో? జబ్బుపడిన మామను కూర్చోబెట్టి, మందులూ, రొట్టెలూ అన్నీ కొనుక్కొచ్చే అల్లుళ్ళెందరికి దొరికారు? అసలు కుటుంబం ఓ స్థాయికి పెంచగల స్తోమతెవరికుంది.

"ఈ ఏడాది యిలా జరిగితే మీదటికి ఈ పూరిల్లు, రెండంకణాలు "స్లాబ్" ఏయిస్తానంటున్నాడు మా కొండయ్య! పై ఏటికి ఓ ఎకరా మాగాణి కొంటా నంటున్నాడు ... అందుకే, పెద్దపిల్ల, పెద్దల్లుడు అఘోరించకుండా, వాళ్ళిద్దరికీ, నాకు ప్రెసిడెం టిచ్చిన ఎకరా మెట్ట ఇచ్చేద్దామనుకుంటున్నా... ఇక ఇక్కడ మా కొండయ్యేం సంపా దించుకున్నా వాళ్ళు వాటాకు రాకుండా కట్టుదిట్టమైపోతుంది!" కొండయ్య ఇచ్చిన డబ్బులతో కాస్తంత సారా పట్టించి, చుట్ట వెలిగించి, హుషారుగా, పాలెంలో వాళ్ళందరూ విన్నా, వినకున్నా అలా చెబుతుంటాడు ఏసోబు. ...అన్నట్లుగానే ఎకరా పొలం పెద్ద పిల్ల, పెద్దల్లుడు రాయించుకుపోయారు ..."నీ పోషణ మా కొద్దు...నీ చిన్న కూతురు, చిన్నల్లుడి సంపాదనా మాకు

పైసా పెట్టొద్దు ... " అని ఖరారు చేసుకువెళ్ళారు ... వాళ్ళకూ కనకం అదృష్టంమీద అసూయగానే వుంది. ఈ మధ్యే కొండయ్య దానికి చేయించిన బంగారం కొత్త ఫ్యాషన్ కమ్మలు ... మూడువందలైనాయిట ! ఈ ఏడాదే మెళ్ళోకి ఒంటి పేట గొలుసు చేయిస్తాడట...

ఆ రోజు ... అయ్యకు అన్నం పెట్టేసి ... కొండయ్యకోసం ఎదురు చూస్తోంది కనకం. ఈ ఏడాదిలో మూడు వాయిలు చీరెలు తెచ్చాడు ! తెల్లవాయిలు చీరె తీసి కట్టుకుంది. తల నిండా గోరింట గుత్తులు తురుముకుంది. ఆ వాసన కొండయ్యకు చాలా ఇష్టమని చెప్పాడు. లారీ ఈ దారంట లోడ్‌తో వెళ్తుందట... రోడ్డువారగా లారీ ఆపి, వచ్చి అన్నం తిని, తనని కూడా సిటీకి పిల్చికెళతానన్నాడు...మాంచి సినిమా ఆడుతోందట సిటీలో ... ఆనందంగా ఆలోచించుకుంటున్న కనకం ... అప్పారావు గొంతుకతో తుళ్ళిపడింది. వాడి వెనకాలే తన పాలెంవాళ్ళు పది మంది రావటం చూసి ఆశ్చర్యపోయింది కూడా. "అక్కా ! కనకమక్కా ... ఏం చెప్పను ... " అంటూ భోరున ఏడ్చాడు అప్పారావు ... సారా బాగా పట్టించి మన స్పృహలో లేకుండా మంచంలో పడివున్నాడు ఏసోబు.

"ఏమయింది అప్పారావ్ ?" అంది కనకం.

" కొండయ్య ... యాక్సిడెంటయ్యింది ... "

"అంటే ?" భయంగా అడిగింది.

"యాక్సిడెంటంటే... ప్రమాదం... సిటీ దాటి వస్తున్న మా లారీతో ... మరో లారీ వచ్చి గుద్దేసింది ... కొండయ్య ... కొండయ్య ... లారీ పక్కనపడి..." అప్పారావిక చెప్పలేక భోరుమని ఏడ్చాడు. మళ్ళీ ! పాలెంలో చాలామంది కళ్ళు చల్లబడ్డాయి ... కొద్దిమంది కళ్ళలో మాంఛి వయసులో, సంతోషంగా వున్న కనకంపట్ల సానుభూతి కురిశాయి...ఇంకా కొందరి కళ్ళలో...

కనకం అచేతనంగా నిలబడి పోయింది. కాళ్ళకింది భూమే కదిలి పోతున్నదో ... తనే భూమిలో కలిసి పోతోందో అర్థంకాలేదు ... పదమంది పాలెంపెద్దలు కనకాన్ని వెంటబెట్టుక, అప్పారావు వెంట రోడ్డుదగ్గరికి వచ్చింది కూడా కనకానికి తెలీదు...

"మా ఓనరు ఈ కబురు చెప్పి రమ్మంటే...మరో లారీ వేసుకవచ్చాను ...పదండి పోదాం!" అంటూ అందర్నీ వెనకాల ఎక్కమని, కనకాన్ని తన పక్కన కూర్చోబెట్టుక లారీ కదిలిం చాడు అప్పారావు ... సీటుకు జారగిల పడిపోయిన కనకంలో కన్నీళ్ళు లేవు... శూన్యంలో ... ఏ అనంతాలలో ఆమె చూపులు చిక్కుకుపోయాయో ఎవరికీ తెలీదు ... లారీ యాక్సిడెంటు జరిగిన చోట... రక్తపు మడుగులో ... శవం లేదు...ఓనరు తరలించాడు దాన్ని ... ఆ రక్తపు మడుగు చూశాక ... కొండయ్య ఎలా చనిపోయుంటాడన్నది ఊహించటానికే భయంవేసింది అందరికీ! ఓనరు చలపతిగారి బంగళాకు చేరా రంతా... ఇంద్రభవనంలాంటి బంగళా ఓ వేపూ ... బంగళాతో సంబంధం లేకుండా ముప్ఫై లారీలు వుంచే షెడ్లు మరోవేపూ వున్నాయి ... షెడ్డులోనే అందరూ సమావేశమయ్యారు...చలపతి గారొచ్చి కుర్చీలో కూర్చున్నారు ... కనకాన్ని చూశారు !


"పాపం ! చిన్న వయసు ! ఇంత కష్టం వచ్చింది. నా లారీ పాడై పోయింది. పదివేలు పెడితేనేగానీ బాగు కాదది ! అయితే ప్రాణంలేని వస్తువు. ఆస్తిపోతే ఆస్తి సంపాదించుకోవచ్చు. మనిషిపోతే మనిషి రాడు...పోలీసులూ, కేసులూ నా కిష్టంలేదు ... పాపం ! కనకం చిన్నవయసులో వుంది. ఆ పిల్ల జీవితమూ గడవాలి ... మీరందరూ ఎలా నిర్ణయిస్తే, అలా డబ్బిస్తాను !" అన్నారాయనగారు గంభీరంగా. వర్కర్లందరూ ఆయనగారు చెప్పిన తీర్పుకు, ఆయనగారి గొంతుకలో తొణికిసలాడిన పాపభీతికీ చలించి పోయారు.

"ఎంతిస్తే న్యాయమో చెప్పండి !" అన్నారు చలపతిరావుగారు మళ్ళీ... వర్కర్లు గుసగుసలాడుకుంటున్నారు. పాలెం పెద్దలు అయోమయంగా నిల్చుండిపోయారు. వాళ్ళ కిలాటివి తెలీదు. అనుభవం లేదు. అంచేత ఇక్కడుండే వర్కర్లు గొప్ప గొప్ప డ్రైవర్లు ... క్లీనర్లు ... ఓనరుబాబు గారు ఏం చెబితే అదే తమ మాట అనుకున్నారు. కనకం రాతిబొమ్మలా కూర్చుండిపోయింది.

"పోనీ ! అందరి తరవునా నువ్వు చెప్పు గురువులూ !" అన్నారు చలపతి గారు. నల్లగా, లావుగా, పొడుగ్గా, నల్లటి బుర్రమీసాలతో - గూండాలా వుండే గురువులు...వర్కర్లలో నలుగు రైదుగురితో గుసగుసలాడి ముందుకు వచ్చాడు.

"ఎవరిదైనా ప్రాణమే సార్ ! మనిషి ప్రాణానికి విలువకట్టలేం కదా ? అయితే చావు కెవరు కర్తలు ... కొండయ్య ఇంట్లో చచ్చాడనుకోండి... ఎవరేం చేయగలం ! అయితే యాక్సి డెంటులో చచ్చిపోయాడు. లారీ ఓనరు తవరు గాబట్టి ... తప్పెవరిదీ లేకున్నా ... ఆ కుటుంబ నష్టం మీరు భరించాలి ...ఇది న్యాయం...చట్టం ... తమరూ మంచిమాటే చెప్పారు. మా కది సమ్మతమే ! కనకం పాపం చిన్నపిల్ల. దానికి తండ్రి వున్నా సంపాదించే శక్తి

లేనివాడు ... ఏదేనా వ్యాపారం పెట్టుకుంటే బ్రతికిపోతుంది ... ఐదారు వేలైతే..." గురువులు సాభిప్రాయంగా వర్కర్లందరివేపూ చూశాడు. అందరి తలలూ అంగీకారం తెలుపుతూ ఊగాయి. పాలెం పెద్దలు గుడ్లు పెద్దవి చేసి, నోళ్ళు తెరిచేశారు. ఐదారు వేలు ! రూపాయలే ? అంటే యాభై వందలు... అరవై వందలు రూపాయలు '... బాబోయ్! కొండయ్య చస్తే ... కనకానికి ఇంత డబ్బొస్తోందా ? మనలో ఒకరిద్దరి అల్లుళ్లు చచ్చారు...కొడుకులు చచ్చారు ... ఏ మొచ్చింది మనకు ?" అనుకున్నారు ఎవరికివారే లోలోపల ! కనకం మరోసారి అదృష్టవంతురాలని తీర్మానించుకున్నారు.



చలపతిగారు గంభీరంగా లేచి నిల్చున్నారు ... "గురువులు చెప్పింది సబబు...నేను ఉదారంగా మరో వెయ్యి ఎక్స్ట్రా వేసి, ఏడువేల రూపాయలుగా ఇచ్చేస్తాను ! పాపం ! తింటే ఆ పిల్లే తింటుంది ! మనకూ అలాటి అప్పచెల్లెళ్ళున్నారు..." అన్నారు ! వర్కర్ల మొహాలు వెలిగిపోయాయి బాబుగారి దయకు ! పాలెంవాళ్ళంతా మూర్ఛపోయారు ... గురువులు గర్వంగా వర్కర్లకేసి చూశాడు. 'నే చెప్పలే ! బాబుగారు ఎంత ధర్మాత్ములో !' అన్నట్లు...

"ఊ ! గురువులూ ! మిగతా ఏర్పాట్లు కానిచ్చేసి...కొండయ్య కర్మక్కావలసిన వస్తువులూ, డబ్బూ పట్టి ... దగ్గరుండి అన్నీ నిర్వహించి, ఈ పదిరోజులూ వెళ్ళాక, ఆ కనకాన్ని పిల్చుకురా, డబ్బిచ్చేద్దాం !" అని వెళ్ళిపోయారు చలపతిగారు. దాచి వుంచిన ముద్దలాటి కొండయ్య శవం — దహనం చేయబడింది. గురువులు కనకం దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యివేసి తట్టి "ఏడవకు కనకం ! అందరికీ వస్తాయి కష్టాలు ...ధైర్యంగా వుండాలి ! నే నొస్తాను పాలేనికి ... అన్ని ఏర్పాట్లు చేస్తాను. నీ డబ్బు ఇప్పిస్తాను..." అన్నాడు చనువుగా. ఆసరికే పాలెం పెద్దలందరికీ గురువులు చలపతిగారికి కుడిభుజం అనీ, చలపతిగారి తర్వాత – ఆ బాబంతటివాడనీ, ఆ బాబుగారు గురువులుమీదే ఈ లారీ షెడ్డు బాధ్యతంతా వుంచారనీ తెలిసిపోయింది. గురువులు బరవసాగా శవదహనానికీ, భోజనాలకూ ఖర్చుపెట్టుతున్న డబ్బులు చూశాక, చలపతిగారి దగ్గర గురువులుకు ఎంత పలుకుబడీ, పరపతీ వున్నది తెలిసిపోయింది. అంచేత గురువులు తమందరిలో ఒకడనీ – తమకు దేవుడులాటివాడనీ నిర్ణయించుకున్నారు కూడాను.

కొండయ్య కర్మ జరిగిపోయాక ... కనకంలో ఆ దుఃఖం కొంత తగ్గింది. కారణం గురువులు ఈ పదిరోజుల్లో మూడుమార్లు వచ్చాడు పాలేనికి, అప్పారావుతో. అందరికీ తల్లో నాలుకలా మెలిగాడు. ఏసోబుకు ధైర్యం చెప్పాడు. ఏసోబు ... తన కూతురికి రాబోయే ఏడువేలతో పొలం కొంటానన్నాడు. నాలుగు గేదెల్ని కొంటే, పాడిచేసుకోవచ్చునన్నాడు. సిటీలో చిల్లరకొట్టు పెట్టుకోవటం మంచిదన్నాడు గురువులు.

లేదా సిటీలో ఓ చిన్న ఇల్లు కట్టించుకుంటే, బాడుగ కిచ్చినా నెలకు వంద రూపాయ లొస్తాయన్నాడు ... తనే దగ్గరుండి ఆ డబ్బు సద్వినియోగం చేయిస్తా నన్నాడు... పాలెంలో కనకం ప్రిస్టేజి మళ్ళీ పెరిగింది...ఏడువేలు ! ఏడువేలు ... ఏసోబు గొంతుకలో, నాలుకమీద అవే ! కనకం మనసులో మాటలో అవే! పాలెంలో ప్రతి ఒక్కరి నోటా అవే ! గురువులు మాట మాటలో అవే ! అంచేత గురువులు వెంట లారీలో కనకం వెళ్ళాలంటే ఎవరికీ ఎబ్బెరికంగా లేదు. గురువులులాటి గొప్పవాడు కనకం యోగక్షేమం వహించటమే అదృష్ట మనిపించింది అందరికీ ! కనకానికూ్కడా కొండయ్య జ్ఞాపకాలు మెల్లిగా మరుగునపడి ... గురువులు ఇవ్వబోయే ఏడువేలమీదే మనసు నిల్చిపోయింది.

నెలరోజుల తర్వాత, కనకాన్ని వెంటబెట్టుక గురువులు సిటీకి వెళ్ళాడు. రెండు సినిమాలు చూపించాడు ... రెండు వాయిలు చీరెలు కొనిచ్చాడు. ఆ రాత్రికి తనింట్లో వుంచాడు. గురువులు భార్య రత్తమ్మ చాలా మర్యాద చేసింది కనకానికి. గురువులుకు ముగ్గురు పిల్లలున్నారు. చిన్నవాళ్ళే... 'చినమ్మ, చినమ్మ' అంటూ చుట్టుకు, చుట్టుకు తిరిగారు. కనకాని కెంతో నచ్చిందిది. మర్నాడు ఉదయం బాబుగారి బంగళాకు పిల్చికెళ్ళాడు గురువులు. ఆ భవనం చూశాక, అక్కడి విలువలేని సామాన్లు చూశాక కనకానికి కళ్ళు బైర్లుకమ్మినట్లైంది. ఆ బంగళాలో గురువులు అరమర లేకుండా రోజూ తిరుగుతుంటాడని తెలిశాక...గురువులుకు మించిన దేవుడు లేడనిపించింది. ఓ గంట తర్వాత బాబుగారొచ్చి హాల్లో సోఫాలో కూర్చున్నారు ... గురువులు కనకం వచ్చిన విషయం చెప్పాడు.

"ఏ కనకం ! ఓ ! కొండయ్య భార్య కదూ ? అవునూ. ఆమె ఇంకా డబ్బు తీసుకోలేదేం ? నిన్నటివరకూ వస్తుందని ఇంట్లోనే వుంచి నిన్న సాయంత్రమే బ్యాంకిలో వేయించా. సరే ! గురువులూ చెక్కు రాసిస్తా ! నువ్వెళ్ళి డబ్బు పట్టుకురా బ్యాంకి నుంచి !" అన్నారు చలపతిగారు చెక్కు రాసిస్తూ. "నువ్విక్కడే కూర్చొనుండు! నే నో గంటలో వస్తా !" అని వెళ్ళిపోయాడు గురువులు. ఆ బ్రహ్మాండమైన హాల్లో ఓ మూలగా ఒదిగి కూర్చుంది కనకం. చలపతిగారు సోఫాలో కూర్చునే వున్నారు. వరసగా ఎందరెందరో వస్తున్నారు. వందలు, వేలు డబ్బు ఎంచి కట్టలు, కట్టలుగా ఆయనగారికి కిస్తున్నారు. కొందరికి ఆయ నిస్తున్నారు. డబ్బు ప్రవాహం ప్రవహిస్తున్న ట్లనిపించింది కనకానికి ! ఓ గంట తర్వాత గురువులు డబ్బు తెచ్చాడు. చలపతిగారి చేతికిచ్చాడు "ఏడువేలు" అంటూ. "సరే ఆమెచేత డబ్బు ముట్టినట్లు సంతకం చేయించు," అన్నారు చలపతిగారు.

అప్పటి కప్పుడే గుమాస్తా ఏవో కాగితాలు వ్రాశాడు. స్టాంపు అతికించాడు.

"సంతకం రాదులెండి ! వేలిముద్ర వేస్తుంది !" అంటూ కనకం ఎడం చెయ్యి చనువుగా పట్టుకుని వేలిముద్ర వేయించాడు గురువులు. గుమాస్తా కనకానికి వినిపించేలా కాగితంలో రాసిన విషయం చదివాడు. కనకానికి, చలపతిగారు ఇవ్వదలచిన ఏడువేల రూపాయలూ, అక్షరాలా ఏడువేల రూపాయలూ ముట్టినట్లు ... డబ్బు కనకం చేతికిచ్చాడు గురువులు. "పాపం ! అమాయకురా లల్లేవుంది గురువులూ ! స్నేహితులు ఈ డబ్బు కాస్తా మాయ మాటలు చెప్పి మోసం చేస్తారేమో ! పాపం !" అన్నారు చలపతిగారు సాలోచనగా, గురువులు కేసి చూస్తూ.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను బాబుగారూ ! తక్కువ బుద్ధు లుంటాయి ! పాపం ! ఏం చేస్తారో ఏమో ! పోనీ ఒకటి చెయ్యండి. డబ్బు మీ దగ్గరే వుంచండి ! సిటీలో చిల్లరకొట్టో ఏదో పెట్టుకునేరోజు మీ దగ్గర్నుంచే తీసుకుంటుంది. డబ్బెక్కడికి పోతుంది తమరి దగ్గర !" అన్నాడు గురువులు గంభీరంగా !

"ఇది మరీ బాగుంది గురువులూ ! ఆ అమ్మాయికి నామీద నమ్మకం వుందో లేదో ... నీకంటే నేను చిన్నప్పట్నుంచీ తెలుసు !" అన్నారు చలపతిగారు నవ్వుతూ. అప్పటికి కనకం నోరు విప్పింది. "ఎంత మాట బాబుగారూ ! తమరు దేవుడు లాటోరు! ఇట్టాంటి ముష్టి డబ్బు మీ పక్కలమీద కూడా పరుసుకుంటారు ! తమరిదగ్గరే వుంచండి ! గురువులు మామతో వచ్చి ...ఎప్పుడో తీసుకుంటా ! నా దగ్గరున్నా ... మా గుడిసెల్లో భయమే !" అంది వినయంగా. చలపతిగారు నవ్వారు మెప్పుదలగా !

"పాపం ! రాతే బాగులేదుగానీ మంచి పిల్లే !" అన్నారు ... పాలేనికి వచ్చాక, బాబుగారి బంగళా విశేషాలు అన్నీ కనకం నోట విన్నాక, కనకం అదృష్టం, ప్రిస్టేజీ మరింత పెరిగింది అందరి మనసుల్లో ! ఏసోబు మళ్ళీ మొదలెట్టాడు. "కొండంత గురువులు దొరికాడు మాకు ! దేవుడంత బాబుగారు దొరికారు మాకు అండగా ! సిటీలోనే సిల్లరకొట్టు పెట్టేస్తాం ! ఆరి నీడలో ఆడే బతికేస్తాం !" అంటూ.

గురువులు - చిల్లరకొట్టు ఏ ప్రదేశంలో పెడితే బావుంటుందో చూపించటానికని...కనకాన్ని అయిదారుమార్లు సిటీకి పిల్చుకెళ్ళాడు...మొదటిసారిగా,

ఇంటికి పిల్చుకెళ్ళకుండా, ఓ చౌకరకం లాడ్జికి పిల్చికెళ్ళాడు సినిమా చూశాక. "ఇదేమిటిది తప్పుకాదూ ?" అంది కనకం ... దగ్గరకు తీసుకుంటున్న గురువులుకేసి భయంగా చూస్తూ ... గురువులు నవ్వాడు. "తప్పేమిటి ? నీ ఆలనా, పాలనా చూస్తాను ! నీ బాగే నా బాగు అనుకున్నాను ... కొండయ్య వుండి, నువ్వు చచ్చిపోయుంటే, కొండయ్య మరో పెళ్ళి చేసుకొనేవాడు కాడా ? అసలు బాబుగారికి నీ గురించి అంతగా నచ్చజెప్పి, అంత పెద్ద మొత్తం డబ్బు ఇప్పించటాని కెంత శ్రమపడ్డా ననుకున్నావు ... యాక్సిడెంట్లలో ఎందరు చావలేదు మా లారీ కంపెనీలో ! ఎవరికీ బాబుగారు ఇంత పెద్దమొత్తం ఇవ్వలేదు ! అంతా నా పలుకుబడే !" అన్నాడు గురువులు... కనకం కాదనలేకపోయింది. అయిదారు మార్లు సిటీ చూడటం – కొత్త వాయిలు చీరెలు...గురువులు సాన్నిహిత్యం... పాలెంలో వారెవరూ వేలెత్తిచూపక పోవటం ... గురువులుకు పాలెంలోగల గౌరవం ... తన వయసు చేస్తున్న గారడీ, వత్తిడీ ... ఆమె శరీరాన్ని మనసునీ నొక్కివేసాయి. అయితే రత్తమ్మ ? ఆమెకు తెలిస్తే ? ఆ మాటే అడిగింది. "దాని మొహం ! నీ కొచ్చే డబ్బులో ఓ వందరూపాయలు నీవి కావనుకుని పిల్లలకూ, దానికీ బట్టలు కొనిపెట్టావనుకో ! పబ్లిగ్గా మా ఇంట్లో మనిద్దరం సరసాలాడుకున్నా కాదనదు ..." అన్నాడు తేలిగ్గా నవ్వి గురువులు ... ఆ తర్వాత గురువులు, కనకం గోరింటపొదల దగ్గర ఎన్ని మార్లు కలుసుకున్నా, గురువులు పబ్లిగ్గా పాలేనికి వచ్చినా ఎవరూ ఎబ్బెరికంగా చూడలేదు. మాట్లాడలేదు. ఎవరేనా పెద్దలు మందలించబోయినా కనకం 'ఏడువేలు' గురువులు 'పోజు' వాళ్ళ నోళ్ళు మూయించేసాయి.

సంవత్సరం తిరిగినా సిటీలో చిల్లర కొట్టు ప్రారంభం కాలేదు ... కనకం మాత్రం రెండ మార్లు ... ఏవో నాటు మందులు తిని కడుపులు పోగొట్టుకుంది ...గురువులు సలహాతో.

"ఆ డబ్బుతే మావాఁ ! భూమో ఏదో కొంటాడు మా అయ్య !" అంది పట్టుదలగా...

"పాపం ! ఈ ఏడాది బాబుగారికి వ్యాపారంలో నష్టం వచ్చింది కనకం... రెండు లక్షలు ! అదో నష్టం కాదనుకో వారిలాటి గొప్పవారికి ! నీ డబ్బు వ్యాపారానికి వాడుకున్నారట... కాదూ కూడదంటే ఇచ్చేస్తారు ! దేవుడిలాటోరికి కష్టంవాస్తే మనం ఆదుకో నవసరం లేదా ? ఆరికుండే సంపదలో మన ముష్టి డబ్బెంత ? కావలిస్తే వడ్డీ ఏసి ఇచ్చేస్తారు పై ఏడాది ! నీ ఇష్టం! తెమ్మంటే తెస్తాను ... బాబుగారే గుర్తు చేశారు మొన్న !" అన్నాడు గురువులు.

కనకానికి జాలివేసింది ! ఆ దేవుడికే కష్టం వస్తే ... తను తన ముష్టి డబ్బు సాయం చేస్తే తప్పా ! అసలు తనలాటి 'పక్షుల' డబ్బు ఆయనకి కావలిసా ? ఏదో మాటకేగానీ ! గురువులద్వారా తనమీద పెంచుకున్న గౌరవంకొద్దీ ఆ మాటనడమేగానీ ... "ఒద్దు మాఁమా! బాబుగారే పిల్చి ఇచ్చినప్పుడు తీసుకుందాం !" అంది కంగారుగా కనకం.

మరో ఏడు గడిచిపోయింది... పాలెంలో కొద్దికొద్దిగా కనకం డబ్బు వస్తుందో రాదో నన్న గుసగుసలు ప్రారంభమయ్యాయి ... గురువులు మొదట్లో కొనిచ్చినంత జోరుగా చీరెలు, బహుమానాలు తేవటంలేదు.

చీరెలు కూడా చిరుగు పడ్తున్నాయి. ఏసోబు బొత్తిగా మంచంలో పడిపోయాడు. ఒక్కోసారి కూతురు అదృష్టాన్ని, ఏడువేలనూ, గురువులనూ ఆకాశానికెత్తుతూ మాట్లాడ్తాడు ధోరణిగా. మరుక్షణంలో "ఈ ముండకా డబ్బు వస్తుందా ? చస్తుందా ? తీసుకున్నట్టు వేలిముద్ర కూడా ఏసేసిందట ! ఈ గురువులుగా డొక దొంగ!" అంటూ బూతులు మొదలెడతాడు. ఇల్లు గడవాలి...పై ఆదాయం లేదు... కొండయ్య భార్యగా వున్నప్పుడు కూలి నాలికి వెళ్లేది కనకం. కొండయ్య చనిపోయి 'ఏడువేలు' అధికారిణి అయ్యాక గురువులులాటి గొప్పవాడి 'తోడు' దొరికాక పెరిగిన ప్రిస్టేజి – ఏడువేల కలలూ – కూలినాలికి దూరం చేశాయి. మూడేళ్ళలో అయిదారుమార్లు కడుపులు పోవటంతో ఆరోగ్యమూ దెబ్బతిన్నది.

'ఏమైనాసరే ! ఈసారి బాబుగారి నడిగి డబ్బు తెమ్మంటాను !' అనుకుంది కనకం నిశ్చయంగా. గురువు లీ మధ్య పాలెంలోకి కూడా తరచూ రావటం లేదు. రోడ్డువార గోరింటపొదల దగ్గరే తనే మాటువేసి లారీ ఆపి మాట్లాడ్తుంది ... అలాగే ఆ రోజు ఆపి ... మరీ చెప్పింది, "ఏమైనాసరే డబ్బుకావాలి" అని ... "అలాగే తెస్తాను...మరొక్క మాట ... ఏమనుకోవు కదూ ?" అన్నాడు నసుగుతూ.

"చెప్పు !" అంది నిర్లిప్తంగా.

"ఇంట్లో రత్తికీ, పిల్లలకూ బట్టలు బొత్తిగా పోయాయి ... నాకూ అంతే! సామాన్లూ అయిపోయాయి. తినటానికి ... పదివందలు ... పదే పది వందలు ... నా కిచ్చావంటే ... ఓ ఆరునెలల్లో వడ్డీవేసి ఇచ్చేస్తా!" అన్నాడు గొణుగుతూ.

కనకం క్షణకాలం పలకలేదు. 'ఇవ్వనని' చేసేందు కేంలేదు. బాబు గారి దగ్గర డబ్బు తేవలసింది గురువులు ... కాదన్నా తనే తీసుకుంటే, తను చేయగలిగిం దేముంది ? "సర్లే !" అంది. రత్తమ్మ ఈ మధ్య తను వెళితే ముక్కూ, మూతీ తిప్పుతోంది ! నా సొమ్ము దోచుకొనే వాళ్లే అంతా ! నా కాపురానికి చిచ్చుపెట్టే వాళ్లే అంతా !" అంటూ సూటి పోటి మాట లంటోంది.

అ వైనా తగ్గుతాయి. ఎలాగో ఓలా బాబుగారిదగ్గర్నుంచీ, గురువులు దగ్గర్నుంచీ డబ్బొస్తే చాలనిపించింది. ఇప్పుడు కనకానికి బాబుగారుగానీ, మరెవరుగానీ దేవుళ్ళలా కనిపించటంలేదు, మనుషల్లానే కనిపిస్తున్నారు. అసలు మనుషల్లో దేవుడుంటం వుట్టి మాట అన్న నమ్మకం కూడా ఏర్పడింది.

"రేపురాత్రి గోరింటపొదల దగ్గరికి రా! నీ డబ్బు తెచ్చి ఇచ్చి, ఆ దారంటే లోడ్ తీసుకపోతాను !" అన్నాడు గురువులు... అందుకే ... అమావాస్య అయినా, చిమ్మచీకటి అయినా ... గోరింటపొదల్లోంచి పాములు దూకినా ...ఒక్కర్తే ... పొలెంనుంచి నడుచుకుంటూ రోడ్డువారగా వచ్చింది ... కనకం.

* * *

"అక్కా ! కనకం అక్కా ! నిద్రపోయినావేంది ? లే ! లే ! గురువులు మావున్నది ఈ పక్క సందులో ఆస్పత్రిలోనే !" అంటూ అప్పారావు అరవటంతో త్రుళ్ళిపడింది కనకం. గతం చెదిరిపోయింది. సిటీ రద్దీ... స్పష్టంగా తెలుస్తోంది ... లారీలోంచి దిగింది. ప్రైవేటు నర్సింగ్ హోం కాబట్టి, ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. ..."సి" క్లాసు రూమ్‌లో గురువులు మంచంమీద పడుకొని వున్నాడు... మంచంపక్కన రత్తమ్మ కూర్చుని కబుర్లు చెబుతోంది. కనకం రూమ్‌లో అడుగెట్టేసరికి రత్తమ్మతో ఏదో నవ్వుతూ తలా చేతులూ తిప్పుతూ మాట్లాడుతున్నాడు గురువులు...కనకం మనసులో గతుక్కుమంది ! ఆ తలకు పెద్ద బాండేజి కట్టుతప్ప...గురువులలో పెద్ద యాక్సిడెంటయిన లక్షణాలేం లేవు ! తన డబ్బుకోసం ఆడిన నాటకం కాదు కదా ? అయినా ఇలాటి నాటకం వల్ల లాభమేముంది ?

కనకాన్ని గుమ్మంలో చూసి గతుక్కుమన్న గురువులు "అమ్మోయ్! బాబోయ్ !" అంటూ మంచంలో పడుకున్నాడు ... రత్తమ్మ కూడా... "నా గతేమిటి దేవుడోయ్ ! నా కెవరిస్తారు పదివేలు ?" అంటూ శోకాలు మొదలెట్టింది కనకంకేసి గుర్రుగా చూస్తూ...

" అసలేమైందక్కా ? " అంటూ వచ్చింది కనకం.

"దానికేం తెల్సు ? అప్పిగాడు చెప్పలే ?" అన్నాడు గురువులు బాధగా...

"చెప్పాడులే..."

"రత్తీ ! కనకం డబ్బు నీ దగ్గరుందిగా ... ఇచ్చెయ్ !" అన్నాడు మూలుగుతూ గురువులు.

"నేను బతికినా, చచ్చినా ... నీ ఋణం ... నా దగ్గరుండకూడదు కనకం ... తీసుకో !" అని కూడా అన్నాడు ... కొంగున గట్టిగా కట్టుకుని వున్న మూట విప్పింది రత్తమ్మ.

"అంతేలే ! ఊళ్ళో అందరికీ చేస్తావు...మనవాళ్ళని... మన కెవరు చేస్తారు ? ఎవరిస్తారు డబ్బు ? ఈ దెబ్బ నయమై మనం ఇంటి కెల్లాలంటే ఐదొందలు అవుతుందన్నాడు డాకటరు! నా కష్టం ... నా పిల్లల కష్టం ఎంతైతే ఐదొందలు అవుతుంది ?" అంది రత్తమ్మ విసురుగా డబ్బు కనకం చేతిలో పెడుతూ.

కనకం ఇబ్బందిగా, గిల్టీగా ఫీలౌతూ నిల్చుండిపోయింది.

"పోన్లేవే ! మనకు దేవుడే వున్నాడు ... ఒకళ్ళకు సాయం చెయ్యటం మన పని ! వాళ్ళ కా బుద్ధి పుడితే చేస్తారు ! లేకుంటే లేదు !" అన్నాడు గురువులు బాధగా. కనకంకేసి చూసి "కనకం ! బాబుగారీ రెండేళ్ళలో కోలుకోలేనంతగా నష్టపోయారు పాపం ! అమ్మగారి సొమ్ము ... ఏదీ – వజ్రాల నగలు... అవి నాచేతే – అమ్మించారు కూడాను ...చేతు లొణికిపోయాయంటే నమ్మ, అమ్ముతుంటే ! పదిహేనువందలిచ్చారు ... మీదటికి మిగతాది చూస్తామన్నారు ... కనకాన్ని క్షమించమన్నానని చెప్పమన్నారు ! ఆ మారాజు నోటంట ఆ మాటొస్తే నేను ఒణికిపోయాననుకో ! బాధతో చచ్చిపోయాననుకో ... మన దగ్గరేముంది ఆయన్ని ఆదుకోవటానికి ? ఆయన మనలాటి ఎదవల్నెందర్నో ఆదుకున్నాడు ... పోనీ అదంతా ! నీ పదిహేనొందలూ తీసుకో ... ఇప్పుడు నిన్ను వెయ్యిరూపాయలు అడగటానికి నాకు నోరు రావటంలా ! నా అగచాట్లు నావి..." అన్నాడు...

"అంతేలే !" అంది నిష్ఠూరంగా రత్తమ్మ.

కనకం క్షణకాలం డబ్బు చేత్తో పట్టుక నిల్చుంది... ఏడువేలు ! కొండలాటి కొండయ్యను మరిపించగలిగిన ఏడువేలు ! గురువులుతో తను నిర్భయంగా తిరగటానికి ... అటు తనకూ, అయ్యకూ, పొలెంపరంగా కూడా 'లైసెన్స్' ఇచ్చిన ఏడువేలు! మూడేళ్ళలో అయిదారుమార్లు తను తల్లి కాబోయి ... కాకుండా ఒళ్లు చెడగొట్టుకోవటానికి ఉపకరించిన ఏడువేలు... సాటి ఆడది ... గురువులు భార్య ... ఆమెముందు తను అగాధంలో నిల్చున్న దానిలా – స్వార్థపరురాలిగా...కేవలం 'బజారుముండ'గా ... తలొంచుకు నిల్చునే స్థితి కల్పించిన ఏడువేలు ఇవి! ఏడువేలా ? వీటికోసం బాబుగారు నాటకం ఆడారు... గురువులు ఆడాడు ...వేలిముద్ర తనది కాగితాల్లో పడింది. చివరకు ... చివరకు తన చేతిలో వున్నవి ... తన అదృష్టం తాలూకు ఏడువేలు కాదు ... పదిహేను వందలు. వీటిల్లో వెయ్యిరూపాయలు గురువులు ముందే మాట తీసుకున్నవి ... మిగతా అయిదువందలు ... గురువులు నెత్తి మీద కనిపిస్తున్న కట్టుకు ... తనకు


మిగిలింది ? పిచ్చిగా నవ్వొచ్చింది కనకానికి ! ఎంతో ప్రయత్నంమీద ఆపుకుంది.

“అక్కా ! ఈ పదివందలూ ... ఇంట్లోకి సామాన్లు తెచ్చుకో. నీకు, పిల్లలకు గుడ్డలు కొనుక్కో ... ఈ అయిదువందలూ ... మామకు వైద్యం చేయించు...నా మూలంగాకదా దెబ్బలు తగిలాయి !” అంది. నోట్లు రత్తమ్మ చేతిలో పెట్టింది.

“ఆఁ ! ఇ వేమూల కొస్తాయి...!” అంటూ ముక్కుతూనే నోట్లు లాక్కుంది రత్తమ్మ. “అప్పారావ్ ! కనకాన్ని... వాళ్ళ పాలెంలో దింపి మరీ వెళ్ళు... ఇక్కడ ఒకరికొకరు తోడైతే ఖర్చు జాస్తి !” అని కూడా అంది ... అప్పారావు ఇలాటి వెన్నో చూశాడు. యోగిలా “రాక్కా ! ” అన్నాడు కనకంతో... లారీలో ఎక్కాక ఇద్దరూ మాట్లాడుకోలేదు ... గోరింటపొదల దగ్గర దింపేసి ఏదో కాస్సేపు మాట్లాడి ...“ఆలోచించుకో, అక్కా ! అంటూ ఇక ఇటేపు తిరిగే ట్రిప్పు ల్లేవక్కా !” అని చెప్పి వెళ్ళిపోయాడు.

తెలతెలవారబోతోంది ... వంటరిగా మెల్లిగా నడిచివస్తోంది కనకం ... గురువులుకు బాబుగారు కొండయ్యకు ఖరీదుగా మూడువే లిచ్చారు ! ఏడు వేలకు కనకం వేలిముద్ర తీసుకున్నారు ... గురువులు ... నాలుగు చీరెలు కొనిచ్చి ... చిన్న చిన్న బహుమతు లిచ్చి కనకాన్ని లోబర్చుకున్నాడు... మిగిలింది... కనకమే ఇచ్చేలా చేశాడు ... ఈ నిజాలు ఏ అదృశ్యశక్తి కనకానికి అశరీరవాణిగా వినిపించదు ... మరి కొన్నేళ్ళు ... అనుభవాల పాతాలులలో మునిగి...మురిగిపోయాక ...కనకం ఊహకే రావొచ్చు.

“ ఎవరూ, కనకమ్మా ? ” ఉల్కి పడింది కనకం...పక్క ఊరి పాపమ్మ ...కూర అమ్ముకుంటుంది... మూడేళ్ళ క్రితం బెంగుళూరు వెళ్ళింది...వచ్చింది కాబోలు.




“ఆ ! నేనే చినమ్మా !” అంది కనకం మెల్లిగా !

“పాపం ! కొండయ్య చచ్చిపోయాటడ...నీకు ఏడువేలు వచ్చాయట ... మనూరివాళ్ళు చెప్పారు ... పోన్లే ! ఎట్లాగో బతుకుతావ్ ! అన్నట్లు...నేను బెంగుళూరు ఎళ్లేముందు...సిటీలో... కొండయ్య లారీ తోలుతూ కనిపించాడే కనకం... ఆ రోజు రిచ్చాబండికి చిల్లర లేకపోతే, కొండయ్యే ఇచ్చాడు. “ముప్పావలా దేందిలే అక్కా ! తీసుకో !” అంటూ. రూపాయి నోటిస్తా నంటే తీసుకోలే పిచ్చి సన్నాసి ! ఇక బెంగుళూరు వెళ్ళాక ...ఇటు రాలేదాయె నేను...ఇదుగో...తీసుకో. ముప్పావలా ...ఋణం వుంటే ... మళ్లీ మనం అది తీర్చటానికి పుట్టాలంట !” అంది పాపమ్మ ముప్పావలా కనకం చేతిలో పెట్టి రోడ్డువేపు వెళుతూ.

చేతిలో మూడు పావలాలు ... నిజాయితీకి మూడు రూపాలు ! చచ్చిన కొండయ్య మిగిల్చిన తన డబ్బులు !

కొండయ్య ఖరీదు ఏడువేలు ! తన బ్రతుకు ఖరీదు ఏడువేలు...అనుకుంది ఒకప్పుడు...ఇప్పుడుతెలిసిందితనకు... చచ్చిన కొండయ్య ... బ్రతికి వున్న తన ఖరీదులు ... విడిగా అయినా, కలిసి అయినా ... ముప్పావలా ... అంతే ! తనను దించే ముందు అప్పారావొక మాటన్నాడు...“నీ కిష్టమైతే... పాలెంలో బతకలేకపోతే ... సిటీలో సినిమాహాళ్ళకాడ... బేరాలు కుదురుస్తానక్కా నీకు ... అయితే ఎక్కువ డబ్బులు రావు...రూపాయి... ముప్పావలా ... పొట్ట గడిచిపోతుంది ... నీ ఇష్టం...చెబితే – ఈసారి వచ్చినప్పుడు ట్రిప్పులో నిన్ను తీసికెళ్ళమంటే తీసికెళతాను ... ” తన కా సమయంలో శరీరం జలదరించింది. మెదడు మొద్దుబారిపోయింది.

కానీ...కానీ...ఇప్పు డర్థమయింది. మనిషి ఖరీదు...?